క్లుప్తంగా

కోర్టు ఆవరణలో మొక్కలు నాటిన జడ్జి



మొక్క నాటుతున్న సివిల్ జడ్జి రాణి

ధర్మారం: మండలంలోని నందిమేడారం కోర్టు ఆవరణలో శుక్రవారం పెద్దపల్లి జూనియర్ సివిల్ జడ్జి కె. రాణి మొక్కలు నాటారు. నూతనంగా ప్రారంభమైన కోర్టు ప్రాంగణంలో నాటిన మొక్కలను స్థానిక న్యాయవాదులు సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేశ్‌బాబు, న్యాయవాదులు ఆకారి రాజేశం, ఆలూరి శ్రీనివాస్, ఎస్ వెంకటేశ్, అశోక్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల 'వన దర్శిని'



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారి

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు శుక్రవారం వనదర్శిని పేరుతో అడవుల పరిశీలనకు వెళ్లారు. ఈ సందర్భంగా అడవులతో లాభాలు, అడవి ఉత్పత్తులు, అడవులపై ఆధారపడి జీవిస్తున్న వారి జీవనశైలి, అడవుల సంరక్షణ, చెక్‌డ్యాంల నిర్మాణం, నీటిని నిల్వ చేసేందుకు కందకాల తవ్వకాలు, జంతువుల సంరక్షణకు అడవులలో చేపట్టే రక్షణ చర్యలు తదితర అంశాలపై ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సయ్యద్ రహ్మతుల్లా విద్యార్థులకు అవగాహన కల్పించారు. పర్యటనలో పాఠశాల హెచ్‌ఎం.ఇరుగురాల ఓదెలు, ఉపాధ్యాయులు హరిప్రసాద్, భాస్కర్‌రెడ్డి, సోమశేఖర్, శ్రీనివాస్ తదితరులున్నారు.

మార్కెట్ యార్డు ఏర్పాటుకు కృషి



పాలవర్గ సభ్యులతో చైర్మన్ రామలింగు

కమాన్‌పూర్: కమాన్‌పూర్ మార్కెట్ యార్డు ఏర్పాటు కోసం కృషి చేస్తానని కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి రాయలింగు అన్నారు. మార్కెట్ కమిటీ కార్యాలయంలో శుక్రవారం నూతన పాలకవర్గ తొలి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మార్కెట్ కమిటీలో రూ. 5 కోట్ల 35 లక్షల నిధులు నిల్వ ఉన్నాయని ఈ నిధులతో మార్కెట్ యార్డు, గోదాముల నిర్మాణానికి ప్రభుత్వ అనుమతితో వాడుకోవచ్చని అన్నారు. కమాన్‌పూర్ మండలంలో ప్రభుత్వ స్థలాలు లేక పోవడంతో సమస్య ఏర్పడుతోందని చుట్టు పక్కల గ్రామాల్లో యార్డు ఏర్పాటు కోసం అనువైన స్థలాన్ని గుర్తించి ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకుని యార్డు ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మిమల్లు, పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెద్దపల్లిరూరల్: అగ్నిప్రమాదాల నివారణకు అనుసరించాల్సిన పద్ధతులపై పెద్దపల్లి మండలం బొంపల్లి పెట్రోల్‌పంపులో శుక్రవారం అగ్నిమాపక శాఖ అధికారి దేవనంది శ్రీనివాస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అకస్మాత్తుగా అగ్ని ప్రమాదం సంభవిస్తే మంటలను ఆర్పేందుకు స్థానికంగా ఉన్న పరికరాలను ఎలా వినియోగించాలి.. మంటలను ఎలా అదుపుచేయాలనే విషయాలపై విపులంగా వివరించారు. పంపు నిర్వాహకులు మంథెన కమల్, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చీఫ్ విప్ పరామర్శ

ఓదెల: మండలంలోని రూపునారాయణపేట మాజీ సర్పంచ్ గుర్రం పద్మను ప్రభుత్వ చీఫ్ విప్ టి.భానుప్రసాదరావు శుక్రవారం పరామర్శించారు. పద్మ భర్త గుర్రం నందం(56) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి కుటుంబాన్ని ఆదుకుంటానని తెలిపారు.

ఎస్సారెస్పీ స్థలాలు కాపాడాలి

- అభివృద్ధి పనులకు బిల్లులు రావడం లేదని సభ్యుల అసహనం
- పలు శాఖల అధికారులు గైర్హాజరు
- సర్వసభ్య సమావేశంలో పలు సమస్యల ప్రస్తావన



సమావేశంలో మాట్లాడుతున్న అంతర్గాం ఎంపీపీ దుర్గం విజయ

రామగుండం: గ్రామాల్లోని ఎస్సారెస్పీ కాలువ స్థలాలకు హద్దులు లేకపోవడంతో కబ్జాకు గురై చివరి రైతుల పొలాలకు సాగునీరు అందడం లేదని, స్థలాలను కాపాడాలని సభ్యులు కోరారు. ఎంపీపీ దుర్గం విజయ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన అంతర్గాం మండల సర్వసభ్య సమావేశంలో పలు సమస్యలను సభ్యులు సభా దృష్టికి తీసుకొచ్చారు. అంతర్గాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లేబర్ రూం, ల్యాబ్ గది, ఇతరత్రా నిర్వహణ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులకు బిల్లులు రావడం లేదని పలువురు సభ్యులు సమావేశంలో ప్రస్తావించారు. పలు గ్రామాలలోని పాఠశాల ప్రాంగణాల్లో శిథిలావస్థకు చేరిన భవనాలను కూల్చివేసేందుకు అనుమతించాలని, రేషన్‌కార్డులో నూతన సభ్యుల పేర్లు ఎంట్రీ కావడం లేదని, పలు గ్రామాల ఉపాధి క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అంతర్గాం మండల కేంద్రం నుంచి కరీంనగర్‌కు ఆర్టీసీ బస్సు నడిపించాలని తదితర సమస్యలను వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు సభకు విన్నవించారు. గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు మార్చి 31 లోగా పూర్తి చేస్తేనే బిల్లులు వస్తాయని, రేషన్‌కార్డులో పేర్లు చేర్చేందుకు మీ–సేవలో దరఖాస్తు చేసుకుంటే తహసీల్దార్ లాగిన్‌కు చేరుతుందని, గ్రామాలలో పాఠశాల ప్రాంగణాల్లో శిథిలావస్థకు చేరిన భవనాలను కూల్చివేసేందుకు డీఈవోకు విన్నవించామని, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పాలకవర్గ తీర్మానంతో తొలగించే అవకాశం ఉంటుందని సంబంధిత శాఖల అధికారులు సమాధానమిచ్చారు. సమావేశానికి ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, మైనర్ ఇరిగేషన్, ఫిషరీస్ శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. సమావేశంలో వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మి, జెడ్పీటీసీ ఆముల నారాయణ, ఎంపీటీసీలు కొలిపాక శరణ్య, మస్కం శ్రీనివాస్, రమేశ్, సర్పంచులు స్వామి, మేర్గు పోశం, ఎంపీడీవో భూక్య యాదగిరి, ఎంపీవో మోతె సమ్మిరెడ్డి, కోఆప్షన్ సభ్యులు దివాకర్, పాషా, కార్యదర్శులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో?



మధ్యలో వదిలేసిన డ్రెయినేజీ నిర్మాణ పనులు

ధర్మారం: ప్రభుత్వ నిధులతో పూర్తి చేయాల్సిన డ్రెయినేజీ నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలేయటంతో ప్రజలు మురుగునీటి వాసనతో ఇబ్బందులు పడుతున్నారు మండల కేంద్రంలోని కాలనీవాసులు మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని పక్క వీధిలో అండర్ డ్రెయినేజీ నిర్మాణం కోసం మండల పరిషత్ నుంచి రూ.2 లక్షల 50 వేల రూపాయలు కేటాయించారు. అయితే పనులు చేపట్టిన కాంట్రాక్టర్ కొద్ది దూరం మాత్రమే పైపులు వేసి మిగతా భాగం కందకాలు తీసి వదిలేశారు. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారగా ఇటీవల కందకాలు తీసిన వాటిలో పైప్‌లు వేసి పూడ్చివేశారు. అయితే పూర్తి స్థాయిలో పైప్‌లైన్ నిర్మాణం చేయకపోవటంతో వీధి ప్రజలు వాడుకున్న నీరు పైప్‌లైన్‌లోకి వచ్చి పైప్‌లైన్ చివరి పైప్ వద్ద నిలిచిపోతున్నాయి. రోడ్డు పైనే మురుగునీరు నిలిచిపోయి దోమలు వృద్ధి చెందటమే కాకుండా దుర్వాసన వస్తోందని వీధి ప్రజలు వాపోతున్నారు. దుర్వాసనతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆందోళన చెందుతున్నారు. డ్రెయినేజీ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కోరినప్పటికీ ఫలితం లేదని ఆరోపిస్తున్నారు. సంబంధిత మండల స్థాయి అధికారులు జోక్యం చేసుకుని వెంటనే పనులను పూర్తి చేసి దుర్వాసన నుంచి విముక్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

టీఎస్‌పీఎస్సీ అవకతవకలపై విచారణ జరపాలి



సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: టీఎస్‌పీఎస్సీ పరీక్షల్లో అక్రమాలపై పోలీస్, కానిస్టేబుల్, ఎస్సై నియామకాల్లో అవకతవకలపై విచారణ జరిపించాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష డిమాండ్ చేశారు. ఉద్యోగ అర్హత పరీక్షల్లో అక్రమాలు జరిగాయని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ హైదరాబాద్‌లో శాంతియుతంగా చేపట్టిన దీక్షను భగ్నం చేసి అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం స్థానిక కమాన్ వద్ద రాజీవ్‌రోడ్డుపై సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీ కారకులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, సవిత, వెంకటేశ్, రాజనర్సయ్య, తిరుపతి, శేషాద్రి, బాబు, దుర్గయ్య, గోపాల్‌యాదవ్, రియాజ్, శారద, సంబయ్య, సతీష్, రంజిత్, రవికుమార్, నర్సయ్య, అన్వేష్, రమేశ్, రాజు, రవీందర్, రాహుల్, విష్ణు, సాగర్, మాయావతి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: డబుల్‌బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులకు న్యాయం జరగకపోతే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడిస్తామని సీపీఐ నగర కార్యదర్శి కె.కనకరాజ్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక భాస్కరరావు భవన్లో మాట్లాడారు. 2016లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణానికి పూనుకున్న రాష్ట్ర ప్రభుత్వం రామగుండం కార్పొరేషన్ పరిధిలో ఇంతవరకు పూర్తి చేయకుండా 2016లో డ్రా తీసి 160 మంది కుటుంబాలను ఎంపిక చేసి మర్చిపోయారన్నారు. గతంలో ఎంపిక చేసిన 160 కుటుంబాలకు ముందుగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలన్నారు. ఎమ్మెల్యే చెప్పే దానికి చేసే పనులకు ఎలాంటి పొంతనలేదని ఈ సంఘటన రుజువు చేస్తుందన్నారు. అర్హులందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయించకపోతే గతంలో డ్రాలో ఎంపికైన లబ్ధిదారులతో కలిసి పలు ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. సమావేశంలో సీపీఐ ప్రజా సంఘాల నాయకులు టి.రమేష్‌కుమార్, మార్కపురి సూర్య, రేణికుంట్ల ప్రీతం, చిలుముల రాజయ్య, సిరిసిల్ల మల్లేష్, రాంచందర్ పాల్గొన్నారు.

న్యాయవాదికి క్రీడారత్న అవార్డు

గోదావరిఖనిటౌన్: ఈనెల 12న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలో జరిగిన రన్నింగ్ పోటీల్లో గెలుపొందిన గోదావరిఖని న్యాయవాది గుల్ల రమేశ్‌కు క్రీడారత్న అవార్డు ఇచ్చి సత్కరించినట్లు బహుజన సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ తెలిపారు. తిరుపతిలో 6వ సౌత్ కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో 100,200,400 మీటర్ల రన్నింగ్ పోటీల్లో పాల్గొని రమేశ్ మెడల్స్ సాధించినట్లు రాధాకృష్ణ తెలిపారు. రమేశ్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని 10 గోల్డ్ మెడల్స్,13 సిల్వర్,11బ్రాంజ్ మెడల్స్ సాధించడం అభినందనీయమన్నారు. రమేశ్‌కు క్రీడా రత్న అవార్డు రావడంపై క్రీడాకారులు శంకర్, సంజీవ్, కొమురయ్య, కిష్టఫర్,మనోహర్ పలువురు అభినందించారు.

సింగరేణి ఉద్యోగి రక్తదానం

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని సింగరేణి సంస్థ ఓసీపీ–3లో పని చేస్తున్న కొల్లూరి సతీశ్ అనే ఉద్యోగి, శుక్రవారం ఓ మహిళకు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచాడు. స్థానిక సింగరేణి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎల్కపల్లి రేణుక అనే మహిళకు అత్యవసరంగా ఏ–పాజిటివ్ రక్తం అవసరం కావడంతో, విషయం తెలిసిన సింగరేణి ఉద్యోగి సతీశ్ వెంటనే స్పందించి రక్తదానం చేశాడు. సతీశ్‌ను పలువురు అభినందించారు.

అర్హులందరికీ డబుల్‌బెడ్రూంలు ఇవ్వాలి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో డబుల్‌బెడ్రూం ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ఇళ్లు కేటాయించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు కోరారు. శుక్రవారం అడిషనల్ కలెక్టర్ లక్ష్మి నారాయణను కలిసి వినతిపత్రం అందించారు. అర్హులని నిర్ధారించిన అధికారులు అందరికీ డబుల్ ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. అనర్హులను జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులను గుర్తించేందుకు మరోదఫా సమగ్ర సర్వే చేపట్టాలని కోరారు. నాయకులు అశోక్, జ్యోతి, శ్రావణ్, ప్రశాంత్, నవీన్, శివాజీ తదితరులున్నారు.

నేడు డయల్ యువర్ ఎమ్మెల్యే

గోదావరిఖని: శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 'డయల్ యువర్ ఎమ్మెల్యే' కార్యక్రమం నిర్వహించనున్నట్లు రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సమస్యల పరిష్కారం కోసం 08728–249666 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

ఆటోట్రాలీ అసోసియేషన్ సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: శ్రీరామ ఆటోట్రాలీ అసోసియేషన్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ కార్పొరేటర్, సంఘం గౌరవ అధ్యక్షుడు మహంకాళి స్వామి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. గతంలో ఎడ్లబండ్లతో సరుకులు రవాణా చేస్తూ జీవనాన్ని సాగించిన వీరంతా ఆటో ట్రాలీలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారన్నారు. వీరిపై చాలా కుటుంబాలు ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారన్నారు. శ్రీరామ ట్రాలీ అసోసియేషన్ కార్మికుల సమస్యలపై తమతో చర్చించాలని కోరారు. దీనికి ఓనర్లందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నాయకులు సురేశ్, రాకేశ్, లింగయ్య, సందీప్, సాయి, శేఖర్, సంతోష్, గణేశ్ పాల్గొన్నారు.

ఆస్పత్రి సిబ్బంది సమయపాలన పాటించాలి

కాల్వశ్రీరాంపూర్: ఆస్పత్రి సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్ అన్నారు. మండలంలోని కూనారం పీహెచ్‌సీలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆస్పత్రిలో వివిధ వార్డులు పరిశీలించారు. ఆస్పత్రి అభివృద్ధికి, పేషెంట్లకు మెరుగైన సేవలందించేందుకు ఉద్యోగులు అంకిత భావంతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మమత, సర్పంచులు డొంకెన విజయ, బుర్ర మంగ, ఎంపీటీసీలు జట్టి దేవేందర్, కొల్లూరి రమాదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


రిజర్వేషన్ ప్రాతిపదికన 'డబుల్' ఇళ్ల కేటాయింపు

రామగుండం: రిజర్వేషన్ ప్రాతిపదికన డబుల్ ఇళ్ల కేటాయింపునకు 660 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు శుక్రవారం రామగుండం తహసీల్దార్ ఎండీ.జాహెద్‌పాషా తెలిపారు. లక్కీడ్రాలో ఇళ్లను దక్కించుకున్న లబ్ధిదారులపై ఏమైనా అభ్యంతరాలుంటే నేడు స్వీకరిస్తామని పేర్కొన్నారు. 17% ఎస్సీలకు, 6% ఎస్టీలకు, 12% మైనార్టీలకు , మిగతా 65% అర్హులైన లబ్ధిదారులకు కేటాయించినట్లు తహసీల్దార్ తెలిపారు.

20న పెద్దాపూర్ జాతర వేలం పాట

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ శ్రీ యోగానంద లక్ష్మీనర్సింహస్వామి జాతరను పురస్కరించుకుని ఈ నెల 20న మధ్యాహ్నం జాతర దుకాణాలకు వేలం పాటలు నిర్వహించ నున్నట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో సదయ్య తెలిపారు. టెంకాయలు పూలు పూజ సామగ్రి, లడ్డూ పులిహోర ప్రసాదాలు, కొబ్బరి ముక్కలు పోగు చేసుకునే హక్కు, తైబజారు, శీతల పానీయాలు అమ్ముకునే హక్కులను పొందేందుకు స్థానిక దేవస్థానం కార్యాలయంలో రూ.100 చెల్లించి టెండరు ఫారం పొందాలని సూచించారు.

ప్రజల సహకారంతోనే శాంతిభద్రతల పరిరక్షణ



ప్రమోద్‌రావు

గోదావరిఖని: ప్రజల సహకారంతో శాంతిభద్రతలు పరిరక్షించవచ్చని గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు అన్నారు. శుక్రవారం వన్‌టౌన్ సీఐగా బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. సమాజంలో జరుగుతున్న సంఘటనలు ఎప్పటికప్పుడు పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ఏదైనా సంఘటన జరిగితే 100 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. రౌడీషీటర్లు తమ ప్రవర్తనను మార్చుకొని శాంతియుత జీవనం కొనసాగించాలన్నారు. అన్ని ప్రాంతాల్లో పర్యటించి సమస్యలపై పూర్తిస్థాయిలో తెలుసుకుంటానని పేర్కొన్నారు.

ఆధ్యాత్మికం

నూకాంబిక పోచమ్మ తల్లికి చందనాభిషేకం



చందనాభిషేకం చేస్తున్న భక్తులు

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలో బర్మా, కాందీశీకుల ఆరాధ్యదైవం శ్రీశ్రీశ్రీనూకాంబిక పోచమ్మ జాతర నవరాత్రోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం పోచమ్మ తల్లి కొలువుదీరిన చలువ పందిరిలో మాలధారణ స్వాములు పసుపు కొమ్ములతో ప్రత్యేక పూజలతో చందనాభిషేకం చేసి తల్లిని కొలిచారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈనెల 21వ తేదీన జాతరకు ముగింపు పలకనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ జెమ్ముల రామారావు తెలిపారు.

అంగరంగ వైభవంగా ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



పూజల్లో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ పుట్టమధు

రామగిరి: ముత్తారం మండలం లక్కారంలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మణ హనుమాత్ సమేత శ్రీసీతారామచంద్ర స్వామి నూతన ఆలయం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా సాగింది. మూడు రోజులాగా వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ పుట్ట మధుతో పాటు మండల ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపనలో జెడ్పీ చైర్మన్

కమాన్‌పూర్: మండలంలోని పేరపల్లిలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ, భూలక్ష్మీ సహిత బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో, సిద్దిపల్లెలో అభయాంజనేయ సహిత. శివపంచాయతన సహిత, నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించగా కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పుట్ట మధు మాట్లాడుతూ పూరాతన సంప్రదాయాలతో బంధుత్వాలు కలుస్తాయన్నారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్‌లు తాటికొండ శంకర్, తొగరి అన్నపూర్ణ, కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

19న మహా రుద్రాభిషేకం

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ శ్రీ సత్య సాయి సేవా మందిరంలో ఈనెల 19న మహా రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు శ్రీ సత్య సాయి సేవ సమితి కన్వీనర్ సుబ్బారావు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వేద పండితులతో సామూహిక మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీసత్యసాయిశ్వర మహా లింగమునకు పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఏర్పాటు పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని శ్రీసత్య సాయి సేవా సమితి సభ్యులు కోరారు.

నిరుపేద కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ వరం



చెక్కులు అందిస్తున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

మంథని: నిరుపేద కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్‌తో కార్పొరేట్ వైద్యం అందుతోందని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు అన్నారు. శుక్రవారం మంథనిలోని తన నివాసంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. సీఎం కేసీఆర్ సీఎంఆర్‌ఎఫ్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నారని తెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి, కౌన్సిలర్లు సీపతి బానయ్య, వీకే.రవి, తదితరులు ఉన్నారు.

చెక్కు అందజేత

రామగిరి: ముత్తారం మండలం సీతంపేటకు చెందిన బియ్యాల కిరణ్‌కు మంజూరైన రూ17,500ల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును శుక్రవారం ఎంపీపీ జక్కుల ముత్తయ్య అందజేశారు.కార్యక్రమంలో సర్పంచ్ పులిపాక నాగేష్, ఉప సర్పంచ్ ఓదెలు, యూత్ అధ్యక్షుడు లక్కేపురం నరేష్, ఏఎంసీ డైరెక్టర్ ఓదెలు, నాయకులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలపై అవగాహన



వలంటీర్లకు అవగాహన కల్పిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన పరిస్థితుల్లోనూ మూఢనమ్మకాలు కొనసాగుతుండడం దురదృష్టకరమని భారత నాస్తిక సమాజం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఉప్పులేటి నరేశ్ అన్నారు. పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌లో ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ సమద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థులు మూఢనమ్మకాలను వీడి సమాజంలో మార్పుకు శ్రీకారం చుట్టాలన్నారు. దయ్యాలు, భూతాలు, మంత్రాలు బూటకమన్నారు. ఇనుప కత్తిని కడుపులో గుచ్చుకోవడం, చేతిపై కిరోసిన్ పోసి కాల్చడం, నోట్లో మంటలు లేపడం, గాలిలో విభూది సృష్టించడం, పేపర్లు కాల్చి చాక్లెట్లుగా మార్చడం లాంటి అనేక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

సంక్షిప్త వార్తలు

సమస్యలు పరిష్కంచరించాలని వినతి

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని బాపూజీ నగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మండల ప్రత్యేక అధికారి రవూఫ్‌ఖాన్‌కు ఎంపీటీసీ బోనాల వెంకటస్వామి విన్నవించారు. శుక్రవారం బాపూజీ నగర్‌కు వచ్చిన ప్రత్యేక అధికారికి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. తాగు నీటి, డ్రెయినేజీ సమస్య ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోవడం లేదని వివరించారు. ప్రత్యేక అధికారి వెంట ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీవో శేషయ్య, జీపీ కార్యదర్శి హరీశ్‌లున్నారు.

మన ఊరు–మనబడితో పాఠశాలలకు మహర్దశ

ఎలిగేడు: మన ఊరు–మనబడి కార్యక్రమంతో పాఠశాలలకు మహర్దశ పట్టనుందని ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎంఈవో కవిత అన్నారు. మండలంలోని ధూళికట్ట జెడ్పీహైస్కూల్‌లో నూతన తరగతి గదుల భవన నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్లే కావేరి, పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ భూసారపు రేవతి, మాజీ ఎంపీటీసీ గొల్లే భూమేశ్, డీఈ, ఏఈలు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కులసంఘ భవనాలకు భూమిపూజ

ధర్మారం: మండలంలోని పైడిచింతలపల్లిలో గౌడ సంఘం, యాదవసంఘం భవన నిర్మాణాలకు శుక్రవారం సహకార సంఘాల ఫోరం జిల్లా చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా బలరాంరెడ్డి మాట్లాడుతూ ఈ రెండు భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ చొప్పరి స్వరూప, యాదవసంఘం, గౌడసంఘం నాయకులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి..

రామగిరి: మండలంలోని బుధవారంపేట(రామయ్య పల్లి)లో గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి శుక్రవారం ప్రజాప్రతినిధులు భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవునూరి రజిత, ఎంపీపీ ఆరెల్లి దేవక్క, జెడ్పీటీసీ మ్యాదరవేని శారద, ఉప సర్పంచ్ నరేశ్, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల తనిఖీ

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్‌లో పారిశుధ్య పనులను శుక్రవారం రామగుండం కార్పొరేషన్ కమిషనర్ సుమన్ రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాలనీలో చెత్తను రోడ్లపై వేయకుండా చెత్తను సేకరించే వాహనాలకు ఇవ్వాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శంకర్ రావు, ఎస్సై నాగభూషణం, శానిటరీ సూపర్వైజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.